



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

ఆదివారం 14 సెప్టెంబర్ 2025 పేజీలు 07


ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో

## ఎన్కౌంటర్

- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి కి చెందిన మావోయిస్ట్ అగ్రనేత జాడి వెంకటి మృతి



2లో

కోర్టు కేసుల పరిష్కారం కోసం

## జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి



**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**
కోర్టు కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని పెంచనర్ల భవనంలో జరిగిన మూడవ జాతీయ లోక్ అదాలత్ సేవల, కమ్యూనిటీ మీడియేషన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయ మూర్తి మాట్లాడుతూ, కోర్టు కేసుల్లో రాజీ మార్గాల ద్వారా ఇరు వర్గాలకూ న్యాయం చేకూరుతుందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంతో పాటు కక్షిదారులు ప్రశాంతంగా జీవించవచ్చని సూచించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి సుజన కళాసికం మాట్లాడుతూ, ఏళ్లుగా పెండింగ్లో ఉన్న కేసులకు లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. వరకట్నం, గృహహింస,చెక్ బౌన్స్,రోడ్డు ప్రమాదాలు వంటి కేసులు తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చు అనిపేర్కొన్నారు.జిల్లాప్రధానన్యాయమూర్తిఎస్.శ్రీవాణిమాట్లాడుతూ,న్యాయవాదులు ప్రజలకు లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించి,వారిని కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రిమినల్,సివిల్ కేసులు, భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తి గొడవలు తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

మిగితా.... 2లో

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని

## సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే






**రెబ్బెన , సెప్టెంబర్13, సూర్య మేజర్ న్యూస్ :**
ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరికిపండ్ల నరహరి ఐ.ఎ.ఎస్. నిర్మించిన ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆలయ ఫౌండేషన్, కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే తపనతో ఆలయ ఫౌండేషన్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మానవ శరీరంలో అన్ని అవయవాలలోకంటేచూపు చాలా ముఖ్యమని, కంటి చూపు సరిగా ఉంటే మనిషి తన పని తాను చేసుకోగలడని తెలిపారు. ( మిగితా..2లో )

## రబీ సి.ఎం.ఆర్. లక్ష్యాలను

**అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలి**

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

2 లో



## మత్స్యశాఖ మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**
ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ జిల్లాలోని మత్స్యశాఖ మహిళా సంఘాలకు చేయూత అందించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ లతో కలిసి మత్స్యకారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఇందిరా మహిళా శక్తి పథకం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు ఇతర కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో మత్స్యశాఖ మహిళా సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, ప్రతిపాదిత మహిళా సహకార సంఘాన్ని తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 132 సంఘాలు నమోదు అయి ఉన్నాయని, సంఘ సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో మత్స్యకారుల మహిళా సంఘాలకు ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, అధికార యంత్రాంగం సమన్వయంతో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 134 మంది మత్స్యకార సహకార సంఘ సభ్యులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కోర్టు కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం

## - రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ సేవలు కోర్టులపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపుతున్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది కేసులు ఈ విధానం ద్వారా సులభంగా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కేసులను ఉపసంహరించుకున్న వారికి న్యాయమూర్తులు, కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందనలు తెలిపారు. పలు




కేసుల్లో బాధితులకు మంజూరైన నష్టపరిహార చెక్కులు, అటవీ జంతువుల దాడిలో నష్టపోయిన వారికి పరిహార చెక్కులు అందజేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. అంతకుముందు జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులను అటవీ శాఖ వసతి గృహంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూల మొక్కలతో స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు పంచాక్షరి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, ఎస్పీ జానకి షర్మిల, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రబీ సి.ఎం.ఆర్. లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

2024-25 రబీ సీజన్ కు సంబంధించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన



సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సి.ఎం.ఆర్.లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్ కు సంబంధించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేసే విధంగా అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని ప్రతి రోజు మిల్లింగ్ చేసి సి.ఎం.ఆర్. చేయాలని, గడువులోగా సి.ఎం.ఆర్. లక్ష్యాలు పూర్తి చేయని రైస్ మిల్లులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం

# చేసుకోవాలి- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ప్రాంతంలో కంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ఆలయ ఫౌండేషన్ స్థాపకులకు ధన్యవాదాలు తెలిపారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలని, త్వరలో తిర్యాణి



మండలంలో కంటి పరీక్ష వైద్య శిబిరం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషమని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. నివాస ప్రాంతాలలో ఉన్న పాత వస్తువులను తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి చేయాలని తెలిపారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు పరికిపండ్ల రాము, శోభన్ బాబు, మిట్టపల్లి రాజేందర్, ప్రజా ప్రతినిధులు అజ్మీర శ్యామ్ నాయక్, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## నిండు కుండల

# కడెం ప్రాజెక్టు

**కడెం, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో గత 4 రోజులుగ కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతుందని శనివారం ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇన్



ఫ్లోగా ప్రాజెక్టు లోకి 8827 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు ఒక్క గేట్ ఎత్తి అవుట్ ఫ్లోగా 7170 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 4.699 టీఎంసీలు కాగ ప్రస్తుత నీటి మట్టం 698.275 అడుగులు 4.269 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు.

# ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో ఎన్కౌంటర్

## - బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన మావోయిస్ట్ అగ్రనేత జాడి వెంకటి మృతి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని గజియాబాద్ జిల్లాలో ఒరిస్సా రాష్ట్రంలోని సువాడా జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ అగ్రనేత జాడి వెంకటి అలియాస్ సురేష్ (55) మృతి చెందాడు. మృతి చెందిన అగ్రనేత జాడి వెంకటి ది బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన వాడుగా ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర పోలీసులు శుక్రవారం ప్రకటించారు. చంద్రవెల్లి గ్రామానికి వంచెందిన జాడి శివయ్య, జాడి రాజమ్మల కు ముగ్గురు సంతానం కాగా వెంకటి కుటుంబంలో చిన్న వాడు. అతనికి తల్లిదండ్రులు కొద్ది సంవత్సరాల క్రితం చనిపోయారు అయినా వెంకటి ఇంటి మొకం చూడలేదని అతని బంధువులు పేర్కొన్నారు. ఇద్దరు అక్కలు కాగా పెద్ద అక్క బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు చెందిన కళాలి రామక్క చనిపోయింది. చిన్నక్క రామటెంకి సుజాత జైపూర్ మండలం పావునూరులో ఉంటున్నారు. కాగా అతని చిన్నాయన తల్లిదండ్రులు కొద్ది సంవత్సరాల క్రితమే చనిపోయారు. మావోయిస్ట్ పార్టీలో డీసీఎంగా పార్టీ టెక్నికల్ కమిటీలో పనిచేస్తున్నట్లు అక్కడి పోలీసులు ప్రకటించారు. 1995 దశకంలో నాటి పీపుల్స్ వార్ గ్రూప్ పార్టీలో కోరియర్ గా పని చేసుకుంటూ నెన్నెల మండలం ఆవడం గ్రామంలో కార్పెంటర్‌గా పనిచేసే వాడు. పోలీసు నిర్బంధం పెరిగి పోవడంతో తరచూ పోలీసులు ఇంటికి వచ్చి వేధించడంతో భార్య ఆవుల బాలమల్లు ను వెంట పెట్టుకొని ఇంట్లో నుంచి వెళ్ళిపోయి బెల్లంపల్లి పట్టణంలోని రవీందర్ నగర్‌లో గుడిసె వేసుకుని ఆగుడిసెలో ఉండేవాడు. ఆయన అక్కడ ఉంటున్నది లీక్ కావడంతో వెంకటి భార్యతో సహా అజ్ఞాతంలోకి వెళ్ళి పోయారు. ఇంట్లో నుంచి వెళ్ళి 27 ఏళ్లు దాటినా తల్లి దండ్రులు చనిపోయినా ఇంటి ముఖం చూడలేదు.

### జాడి వెంకటికి ఇద్దరు అక్కలు....

ఒక అక్క జైపూర్ మండలం పావునూరు కు చెందిన రామటెంకి సుజాత, మరో అక్క కళాలి రామక్కలు ఉన్నారు. వెంకటి పార్టీలోకి వెళ్లకముందు మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ సుంకరి గా పని చేసేవాడు. అజ్ఞాతం లోకి వెళ్లిన వెంకటి 2005 - 06 లో ఒరిస్సా రాష్ట్రంలోని రూర్ కెలాలో పార్టీ నాయకులను, అక్కడే జాడి వెంకటిని పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పట్లో కొద్ది నెలలు వరంగల్ సెంట్రల్ జైలులో జైలు జీవితం గడిపిన వెంకటి జైలు నుంచి బెయిల్ పై విడుదలై మళ్ళీ అజ్ఞాతంలోకి వెళ్ళి పోయారు.

### అందరితో కలివిడిగా ఉండే వాడు

### .... బీ ఆర్ ఎస్ నేత కొమ్మెర లక్ష్మణ్

దళిత కుటుంబానికి చేసిన జాడి వెంకటి నాడు గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడని నాడు గ్రామ సుంకరిగా, నెన్నెల మండలం ఆవడంలో కార్పెంటర్‌గా పనిచేసేవాడు ఆయన ప్రజల కోసం పనిచేసేందుకు మావోయిస్ట్ పార్టీలోకి వెళ్లారు. 27ఏళ్ల తర్వాత పోలీసులు జరిపిన ఎన్కౌంటర్‌లో చనిపోవడం తమకు బాధ కలిగిందన్నారు. ఆయనమృతి తీరని లోటుగా భావిస్తున్నామని అన్నారు.

### భార్య బాల మల్లు ఇప్పటికీ అజ్ఞాతం లోనే....

27 ఏళ్లు గా మావోయిస్ట్ పార్టీలో పని చేస్తున్న ఆవుల బాలమల్లు అలియాస్ పుష్ప కూడా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని మహిళా డివిజన్ కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికి పోలీసులకు చిక్కలేదు. జైలుకు వెల్లి ఇంటికి వస్తానని చెప్పి ఇంటి మొఖం చూడ లేదు జైలు నుండి వంచి విడుదలై జాడి వెంకటి అజ్ఞాతంలోకి మళ్ళీ వెళ్లారు. గ్రామంలోనీ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువు కున్నారు. ముప్పై ఏళ్ల క్రితం వెంకటి గ్రామానికి చెందిన ఆవుల బాలమల్లుఅనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరి కులాలు వేరు కావడంతో కుటుంబీకులు తిరస్కరించడం వలన వేరుగా ఉండేవాడు. అప్పటి పీపుల్స్ వార్ గ్రూప్ పార్టీలో కొరియర్‌గా పనిచేసే వాడు. 1998లో పోలీసుల నిర్బంధం బాగా పెరిగి పోవడంతో ఆయన కోసం పోలీసులు గాలించడంతో పాటు ఇంటికి వచ్చి వెంకటి ఎక్కడ ఉన్నాడో చెప్పండి అంటూ కుటింబీకులను వేదింపులకు గురి చేసే వారని అతని కుటీంభీకులు పేర్కొన్నారు. 1998లో నాడు పోలీసుల వేధింపులు తట్టుకోలేక భార్యబాలమల్లు అలియాస్ పుష్పతోకలిసి అజ్ఞాతంలోకి వెళ్ళి పోయారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి - హెల్త్ అసిస్టెంట్ కమలాకర్

**జన్నారం, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ అన్నారు. జన్నారం మండలం తపాలాపూర్ గ్రామంలో సిద్ధి వినాయక గ్రామ సమైక్య మహిళా సంఘ సభ్యులకు శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశు



భ్రత, పౌష్టికాహారం, రక్తహీనత అలాగే దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం, జలుబు, ఒళ్ళు నొప్పులు, దగ్గు లక్షణాలు కనబడితే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఐకెపి సిసి కొమురవెల్లి, వివో ఏ లు దుంపల రమాదేవి, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు లలిత, విజయ, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోంది

## - భూమిపూజలు చేసుకుని పనులు వాయిదా - కాంగ్రెస్ ప్రభుత్వమే పేదల అండ - ప్రజలు వాస్తవాలు గ్రహించాలి

## - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్

**సిరికొండ సెప్టెంబర్ 13 సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఇమామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం అంగన్వాడి భవనానికి భూమిపూజ చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. తాజాగా మరోసారి రూ. 1.20 కోట్ల విలువైన పనులకు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమిపూజ చేసినా, అవి ఎప్పుడు మొదలవుతాయో స్పష్టత లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఏదైనా అండగా నిలిచేది ఉంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు, రుణమాఫీ, వడ్డీ లేని రుణాలు వంటి పథకాల ద్వారా పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. సిరికొండలో కాంగ్రెస్ హయాంలో 38 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, బీఆర్ఎస్ పది సంవత్సరాల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేకపోయిందని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా 8




అసంపూర్ణంగానే ఉన్నాయని ఆయన ఎత్తిచూపారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను తమ కృషిగా చూపుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. సిరికొండ ప్రజలు వాస్తవాలు గ్రహించి కాంగ్రెస్‌ను నమ్మాలని కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పెందుర్ అనిల్ కుమార్, మాజీ జెడ్పిటిసి కుమ్ర చంద్రకళ, రఘురాం, మాజీ ఎంపిటిసి మాధవ్ పటేల్, ఏఎంసీ డైరెక్టర్ ప్రకాష్, రాజు, కంచం లక్ష్మణ్, ఈశ్వర్, రషీద్, జేల్ల సతీష్, బొడ్డు దత్తు, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఫోర్జరీ సంతకాలు చేసిన కేసులో 8 మంది నిందితులు అరెస్ట్




◈ నకిలీ షురూటీలో ప్రభుత్వ అధికారి సంతకాలు ఫోర్జరీ చేసి డాక్యుమెంట్ల సృష్టించి వాటిని నిజమైనవని కోర్టులో సబ్మిట్ చేసిన నిందితులు ◈ నకిలీ షూరిటీలను ఉపయోగించిన,లబ్ది పొందిన,బ్రోకరిజం చేసిన 17 మంది పై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు ◈ నకిలీ డాక్యుమెంట్లతో కోర్టును సైతం మోసం చేసిన నిందితులు ◈ ప్రభుత్వ అధికారులు అపరిచితులకు, నేరస్తులకు షూరిటీలను ఇచ్చే ముందు జాగ్రత్తలు పాటించాలి ◈ ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ ,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

తలమడుగు మండలం కోత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరవేని రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడింది.ఫిర్యాదు వివరాల ప్రకారం అభిలాష్ రెడ్డి (కారోబార్), సయ్యద్ ఇర్ఫాన్ (బ్రోకర్) అనే వ్యక్తులు పంచాయతీ కార్యదర్శి సంతకాలను నకిలీగా సృష్టించి, నకిలీ గృహ విలువ పత్రాలు, పన్ను రసీదులు తయారు చేసి కోర్టులో నేరస్తులకు బెయిల్ కోసం, కోర్టు నుండి జప్తు చేయబడిన ప్రాపర్టీల రిలీజ్ కోసం స్యూరిటీ పత్రాలుగా సమర్పించినట్లు తేలింది. ఈ చర్యలో గంటి సత్తెన్న, మద్దెల అశోక్‌ల పేర్లను ఉపయోగించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం జరిగింది.ఈ సంఘటనపై శనివారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీసు ముఖ్య అధికారి అఖిల్ మహాజన్ స్పందిస్తూ ప్రభుత్వ పత్రాలను నకిలీ చేయడం,కోర్టును తప్పుదారి పట్టించే చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని స్పష్టం చేశారు.ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ఎస్పీ పత్రాలను నకిలీ చేసే వారు,వాటిని ఉపయోగించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే వారు ఎవరైనా కఠినమైన శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి నకిలీ పనులపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసు నందు బ్రోకరు, కారోబార్ ఇద్దరు కలిసి వారి లబ్ధి స్వలాభం కై నకిలీ షూరిటీ పత్రాలను పంచాయతీ సెక్రటరీ పేరుపై తీసుకొని వాటిని ఉపయోగించి కోర్టు నందు నిందితులకు షూరిటీలుగా ఇచ్చి, కోర్టు ఉత్తర్వుల ద్వారా జైలు నుండి బయటకు రావడం లాంటి చర్యలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కోర్ట్ నందు పంచాయతీ సెక్రెటరీ ధ్రువీకరించినట్టుగా ఉండేటువంటి నకిలీ ఆస్తి పత్రాలను షూరిటీలుగా చూపిస్తూ, వాహనాలను సెల్ఫోన్లను కొన్ని ప్రాపర్టీలను రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు. తెలియని వారికి, పెద్ద పెద్ద నేరాలు చేసే వారికి, బ్రోకర్ల ద్వారా వచ్చే వారికి షూరిటీలు ఇచ్చి మోసపోకుండా ఉండాలని, మీరూ షురూటి ఇచిన నిందితులు పారిపోయినట్లయితే మీనుండి డబ్బులను, ఆస్తిపత్రాలను జప్తు చేయబడుతుందని, కట్టని యెడల ఆస్తుల స్వాధీనం లేదా చట్ట పరమైన చర్యలు ఉంటాయి. సూచనలు ఇచ్చారు.ఈ ఘటన నందు నకిలీ షూరిటీల ద్వారా లబ్ధి పొందిన నిందితులపై కూడా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పై దాడి

**బోథ్: సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిపై శుక్రవారం అర్ధరాత్రి కొందరు యువకులు దాడి చేశారు. బాధిత వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన ఓ యువతి పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు ఆమెను బోథ్



ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే సిబ్బంది ఆమెకు వైద్యం అందిస్తుండగానే అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వైద్య సిబ్బందిపై దాడి చేశారు. దాడికి నిరసనగా వైద్య సిబ్బంది ఒపీ సేవలను నిలిపివేశారు. ఘటన గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి మాట్లాడుతూ పేషేంట్ కంటిన్యూగా వాంతులు చేసుకుంటుండడంతో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ కు రెఫర్ చేశామని అందుకు వైద్య సిబ్బంది పై దాడి చేశారన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సీఐ హామీతో విధుల్లో చేరిన వైద్య సిబ్బంది

విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై దాడికి నిరసనగా బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది తమ విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కాగా విషయం తెలుసుకున్న స్థానిక సీఐ వెంకటేశ్వర రావు ఆసుపత్రికి చేరుకొని సూపరింటెండెంట్ రవి కుమార్ తో చర్చించారు. ఘటనకు భాద్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రి వద్ద పోలీసు ఔట్ పోస్టింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వైద్య సిబ్బంది విధుల్లో చేరారు.

## రెస్క్యూ కాంపిటీషన్లో శ్రీరాంపూర్ ఏరియాకు 3 బహుమతులు

**శ్రీరాంపూర్ సెప్టెంబర్ 13 సూర్య మెజార్ న్యూస్:**

రెస్క్యూ కాంపిటీషన్లో శ్రీరాంపూర్ ఏరియాకు 3 బహుమతులు రావడం జరిగింది.ఈ బహుమతులు సాధించిన శ్రీరాంపూర్ ఏరియా రెస్క్యూ సభ్యులను శనివారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా



జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు రెస్క్యూ పోటీలలో తమ ప్రతిభ పాటవాలను చాటెట్టడం అభినందించదగిన విషయమని మొదటి బహుమతి ఆపరేటర్స్ టెస్టింగ్లో,బెస్ట్ డ్రిల్ పరేడ్‌లో మొదటి బహుమతి రావడం,ఓవరాల్ కాంపిటీషన్లో మూడో బహుమతి రావడం అభినందించదగిన విషయమని,2025 నవంబర్‌లో వెస్టన్ కోల్ లిమిటెడ్ నాగపూర్లో జరిగే ఆలిండియా మైన్స్ రెస్క్యూ కాంపిటీషన్ కు శ్రీరాంపూర్ ఏరియా నుండి జి శంకర్ (ఓవర్మెన్ ఐకె1ఎ), ఆర్ సురేష్ (జనరల్ అసిస్టెంట్ ఐకె1ఎ)ని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఆర్కే 5 గని ఏజెంట్ శ్రీధర్, ఇన్చార్జి క్వాలిటీ కే వెంకటేశ్వర్ రెడ్డి, రెస్క్యూ ఇన్చార్జ్ ఏ రామ్మోహన్, టీం సభ్యులు కె అజయ్ జనరల్ అసిస్టెంట్ ఆర్కే 7 టి మనోహర్ జనరల్ అసిస్టెంట్ ఆర్కే 7, శుభం మండల్ ఓవర్మెన్ ఆర్కే7, జే వెంకటేష్, మైనింగ్ సర్దార్ ఆర్కే న్యూటెక్, విహారి ట్రామర్ ఆర్కే 5 తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట

**లక్షెట్టిపేట,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్ :**

రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ లోని మోదేల లో పొలం




బాటను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సిబ్బంది కలిసి వంగిన పోల్స్ ను సరి చేయడం ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఎర్తింగు, లూస్ లైన్స్ సరిచేశారు. ఈ సందర్భంగా ఏఈ గణేష్ మాట్లాడుతూ. రైతులు పొలాలలోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. దాని ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులు విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అగ్రికల్చర్ కు నాణ్యమైన విద్యుత్ అందియడమే తమ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జి నర్సింగరావు,ఎఫ్.ఎం సత్యనారాయణ, లైన్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, భూమన్న,స్థానిక విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## యూరియా ఇచ్చి

### మా పంటలను కాపాడండి సారు

**చింతలమానేపల్లి, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బాలాజీ అనుకోడా రైతు వేదిక ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు. రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి ఉదయం



ఎనిమిది గంటల నుండి ఆధార్, పట్టా పాస్ బుక్ జిరాక్స్ లు పట్టుకొని యూరియా కొరకు మండలంలోని అన్ని గ్రామాల రైతులు దాదాపుగా నాలుగు గంటలు వేసి చూస్తూ ఉండగా మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసిల్దార్, పలు గ్రామాల ఏఈవోలు అలాగే సొసైటీ సిబ్బంది వచ్చి యూరియాను ఇవ్వడానికి తలుపులు తెరవగా ఒక్కసారిగా ఎగబడి మాకు ఇవ్వమంటే మాకు ఇవ్వాలి అంటూ రైతులు గొడవ చేశారు. ఇదివరకు రాసి ఉన్న రైతులకు కూపన్ల ప్రకారం ఒక పట్టాకు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని , కొత్తగా తీసుకునే రైతులకు సోమవారం రోజున యూరియాను అందేలా చేస్తామని మాట ఇచ్చారు. దాంతో రైతులు 10 ఎకరాలు ఉన్న రైతులు రెండు యూరియా బస్తాలు ఇస్తే ఎలాగా అని రైతులకు అందే యూరియాను దళారులకు అందజేస్తూ మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నారంటూ మా పంటలను కాపాడండి అంటూ రైతులు గొడవకు దిగారు. దాంతో పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి గొడవ చేస్తున్న రైతులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేయగా రైతులు వినకపోవడంతో ఎస్ ఐ నరేష్ రంగంలోకి దిగి రైతులందరికీ తప్పకుండా యూరియా అందేల సహకరిస్తామని ప్రతి ఒక్కరూ కూపన్ల ప్రకారం తీసుకోవాలని రైతులతో చెప్పి యురియాను వ్యవసాయ అధికారులతో రైతులకు పెట్టకు రెండు విలువ బస్తాలను ఇప్పించారు.



## దాభాలో తీవ్ర విషాదం

**- ప్రమాదవశాత్తు నీటికుంటలో నలుగురి దుర్మరణం**

**వాంకిడి సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని దాబా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చీకిలీవాగు నీటి కుంటలో అదే గ్రామానికి చెందిన మోహర్లే నిర్మల (30).తల్లితో పాటు కుమారుడు మొహర్లే గణేష్ (12) మరో ఇద్దరు అమ్మాయిలు వాడై మహెశ్వరి (10) అదే శశికళ (10) దుర్మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని చికిలివాగు నీటికుంటలో ఖాళీ యూరియా బస్తాలు కడుగుతుండగా, ఓ ఖాళీ బస్తా నీటిలో కొట్టుకుపోయింది. ఆ బస్తాను తేచ్చెందుకు గణేష్ నీటిగుంటలో దిగగా నీటి లోతు ప్రవాహం అధికం ఉండటంతో గల్లంతైయ్యాడు. గమనించిన తల్లి నిర్మల కాపాడేందుకు వెళ్లగా,ఆమె వెంట శశికళ, మహేశ్వరి నీటిలో గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న మరో అమ్మాయి గమనించి పరుగున వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాలను వేలికితీశారు.ఒకే గ్రామంలో నలుగురు మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీస్ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.



## సింగరేణి ఉద్యోగుల రాకపోకలకు బస్సు సౌకర్యం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**
గోలేటి క్రాస్ రోడ్డు నుండి ఖైరిగిర ఉపరితల గని వరకు ఉద్యోగుల రాకపోకలకు బస్సు సౌకర్యాన్ని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.



విజయ భాస్కర్ రెడ్డి శనివారం ప్రారంభించారు.మూడు షిఫ్ట్ ల ఉద్యోగులను విధులకు తీసుకెళ్ళడంతో పాటు తిరిగి ఇంటికి వెళ్లేందుకు గోలేటి క్రాస్ రోడ్డు వరకు వెళ్తుంది.ఐదేళ్ళ పాటు ఈ బస్సు సేవలు కొనసాగుతాయని జనరల్ మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఓ మచ్చగిరి నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె శంకర్, సంక్షేమ అధికారి రజినికుమార్, ఏఐటియుసి నాయకుడు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా చెట్టు

### - పట్టించుకోని అధికారులు

**కడెం, సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్ :**



లింగాపూర్ నుండి ఖానాపూర్ వెళ్ళే దారిలో ఒక చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా ఉంది. అటుగా వాహనాలపై వెళ్తున్న వారు చెట్టు విరిగి ఎప్పుడూ పడుతుందా అని భయాందోళనలో వెళ్తున్నారు. కావున పంచాయతీ అధికారులు, నాయకులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నిరంతర సాధనకు ఓటముండదు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**
క్రీడల్లో గెలుపోటములు సహజం కాని వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసే వారికి ఓటముండదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో (డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) 92వ వార్షిక క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆట ఆడిన శారీరక ధారుఢ్యంకు సమానంగా మానసికంగా పరిపక్వత ముఖ్యమన్నారు. ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేయడం కూడా క్రీడలో ముఖ్యమన్నారు. పలు ప్రాంతాల వ్యక్తుల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు.అనంతరం డిపార్ట్ మెంటల్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఖైరిగురి పిఓ జట్టు పై ఎస్ఓటు జిఎం జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు బయ్య మొగిలి, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డీజిఎం (సివిల్) ఎస్.కె. మదీనా బాషా,పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ ఓడి ఎం శ్రీనివాస్,సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ అశోక్,స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష, జనరల్ క్యాప్టెన్ కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



# అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### - రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద





**చెన్నూర్ ,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**
రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూరు మండల తహసిల్దార్ మల్లికార్జున లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని పోలబోయిన రమేష్ ఇంటి నుండి పోలోజీ సత్యం ఇంటి వరకు అంచనా విలువ 6 లక్షల 80 వేల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో అంతర్గత సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా పథకాలతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో గల గోదావరి పుష్కర ఘాట్ ను పరిశీలించారు. 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. పుష్కర ఘాట్ ప్రాంతంలో త్రాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక గదులు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు ఇతర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వృద్ధులు పుష్కర ఘాట్ వరకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇతరులు ఎవరైనా వాహన పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు నిలిపి నడక ద్వారా పుష్కర ఘాట్ కు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పుష్కరాల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండలో ఆదివాసీ సంఘాల ఎన్నికలు

**సిరికొండ, సెప్టెంబర్ 12 సూర్య మేజర్ న్యూస్**
సిరికొండ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మరియు ఆదివాసీ విద్యార్థి సంఘం మండల నూతన కమిటీల ఎన్నికలు శుక్రవారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువత, సమస్త జాతి పెద్దలు పాల్గొని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పెందోర్ దాదిరావు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా, కుంరం యాదొరావు జిల్లా ఉపాధ్యక్షుడిగా, పూర్క చిత్రు ఇంద్రవెల్లి అధ్యక్షుడిగా, పెందోర్ సంతోష్ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా, కనక గణేష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.సిరికొండ మండల తుడుం దెబ్బ కమిటీని పాత వారికే ఏకగ్రీవంగా తీర్మానం గౌరవం మండల అధ్యక్షుడిగా పెందోర్ అమృత్ రావ్,మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు కుమరం యాదవ్ రావ్,కుమరం భీం ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడిగా కోట్నాక్ పాండు , ప్రధాన కార్యదర్శిగా పెందోర్ అనిల్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

### నూతన విద్యార్థి సంఘం కమిటీని ఏకగ్రీవంగా తీర్మానం

మండల గౌరవ అధ్యక్షుడిగా సిడం నాగోరావ్, మండల అధ్యక్షుడిగా పెందోర్ మహేంద్ర, మండల ప్రధాన కార్యదర్శిగా సిడం వినోద్, కార్యదర్శిగా కుమరం జనార్దన్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల కోసం సమైక్యంగా పోరాటం కొనసాగించాల్సిన అవసరాన్ని ముఖ్యంగా గుర్తు చేశారు. సిరికొండ మండల తుడుందెబ్బ కమిటీ పాత వారికే కొనసాగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుంరం రఘురాం, రీమ్ము సార్మేడీ, అమృత్ రావ్, గేడం దత్తు, మెస్రం హన్మంత్ రావ్,బాదు పటేల్, కుంరం రావుజీ పటేల్, గేడం చంపత్ రావ్, వివిధ గ్రామాల పటేల్లు దేవరిలు మహజన్లు సార్మేడిలు వివిధ నాయకులు, వివిధ యూత్ యువకులు యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఆడపిల్ల లేని ఇల్లు చందమామ లేని ఆకాశం ఒక్కటే : ఎస్పై అనూష

**జన్నారం, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :** ప్రతి ఇంటిలో ఆడపిల్లతో ఆనందం ఉంటుందని, ఆడపిల్లలేని ఇల్లు చందమామ లేని ఆకాశం




ఒక్కటేనని, అందుకే ప్రతి ఇంట వెన్నెలలా ఓ కూతురు ఉండాలని జన్నారం ఎస్పై గొల్లపల్లి అనూష అన్నారు. శనివారం అనూష సూర్య మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ ఆడపిల్ల ఇంట్లో ఉంటే ఎన్నో లాభాలు ఉంటాయని, ఇంటి శుభ్రతతో పాటు ఇంటిల్లిపాదిని కంటికి రెప్పలా చూసుకుంటారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రకృతి మనకు చాలా నేర్పుతుంది, కోకిల నుంచి తియ్యగా మాట్లాడటం, పువ్వుల నుంచి నవ్వటం, చెట్టుకొమ్మల నుంచి వంగటం లాంటివి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అదేవిధంగా మనం మాట్లాడే మాటలు ఎదుటి వ్యక్తిని సంతోష పెట్టకపోయినా పర్వాలేదు, కానీ కించపరచకుండా ఉంటే చాలు అని అన్నారు. టీచర్ ఒకప్పుడు విద్యార్థి... ప్రతి విజేత ఒకప్పుడు ఓడినవాడే... ప్రతి నిపుణుడు ఒకప్పుడు ప్రారంభకుడే... కానీ అందరూ దాటి వచ్చింది నేర్చుకోవడం గొప్పతనం అని అన్నారు. అలాగే చదువు, సంస్కారం మంచి జీవితానికి మూల సూత్రాలని, చదువు ఎప్పుడూ తలదించనియ్యదు, సంస్కారం ఎప్పుడూ పడిపోనివ్వదు అని అనూష అన్నారు. ప్రతి మనిషి ఎప్పుడూ చిరునవ్వుతో ఉండాలని, నవ్వు అనేది ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు.

### రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఇంధన్ పల్లి విద్యార్థి ఎంపిక

**జన్నారం, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో అండర్ 14 సంవత్సరాలు 50 మీటర్లు బటర్ ఫ్లై విభాగంలో జన్నారం మండలం ఇంధన్ పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి కే.రేవంత్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్ శివనూరి తిరుపతి లు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న రేవంత్ త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయికి విద్యార్థి రేవంత్ ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో
# పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**మావల,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

పట్టణంలోని రామనగర్‌లో ఏర్పాటు చేసిన ఏ.ఆర్.కె హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆడే గజేందర్‌లతో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సౌకర్యాలతో ఈ ఆసుపత్రి ప్రారంభమవడం సంతోషకరమని తెలిపారు. సాధారణ చికిత్సలతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో క్రిటికల్ కేర్, ట్రామా, లాపరోస్కోపిక్, లేజర్ మరియు అధునాతన గాయాల చికిత్స కేంద్రం అందుబాటులో ఉండడం ఆదిలాబాద్ ప్రజలకు మేలు చేస్తుందని అన్నారు.డా. రంజీత్ కుమార్ జాధవ్,డా. అశ్విని రాథోడ్ అద్వర్యంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ప్రజలకు 24 గంటల వైద్యసేవలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, పలువురు వైద్యులు, రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బడికి పొమ్మన్నందుకు బాలిక ఆత్మహత్య

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

బడికి వెళ్ళి చదువుకో బిడ్డా అంటూ ఓ బాలికను తల్లి దండ్రులు మందలించడంతో ఆ బాలిక ఎలుకలు, పందికొక్కు లను నివారించేందుకు వినియోగించే మందును త్రాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో శనివారం తెల్ల వారుజమున జరిగింది. గ్రామానికి చెందిన ఎగ్గేవార్ రామాజీ- లక్ష్మీ రెండోవ కూతురు ఎగ్గేవార్ సుప్రియ (14) శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు నిద్రిస్తుండగా బాత్రూంలో ఉన్న పంది కొక్కులకు, ఎలుకల నివారించేందుకు పెట్టే మందు సేవించింది. కొద్దిసేపటికి సుప్రియకు వాంతులు అయ్యాయి.కుటుంబీకులు లేచిచూసేసరికి అస్వస్థగురైనట్టుగా ఉండడంతో గమనించిన కుటుంబీకులు సుప్రియ ను బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ సుప్రియ మృతి చెందింది. కాగా సుప్రియ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. అనారోగ్యం కారణంగా మూడు నెలలుగా స్కూలుకు వెళ్ళక పోవడంతో తల్లి దండ్రులు సుప్రియను స్కూలుకు వెళ్ళాలని మందలించడంతో శుక్రవారం స్కూలుకు వెళ్ళింది.శనివారం తెల్లవారు జామున సుప్రియ ఆత్మ హత్యకు పాల్పడటం గ్రామంలో విషాదం అలుముకుంది. ఎగ్గేవార్ రామాజీ కుటుంబం కుటుంబం బతుకుదెరువు కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బంగార తలోడి గ్రామం నుంచి పదేళ్ల క్రితం ఆకెనపల్లికి వచ్చి స్థిరపడ్డారు. రామాజీకి ముగ్గురు కూతుళ్లు కాగా రెండోవ కూతురు సుప్రియ ఆత్మహత్య కు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి మండలం తాళ్లగురజాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ విక్రంరావును పరామర్శించిన మంత్రి వివేక్

**కాసిపేట, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

కాసిపేట మండల మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రం రావును గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పరామర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రం రావు నానమ్మ విజయ లక్ష్మీ ఇటీవల మృతి చెందగా కాసిపేట మండల కేంద్రంలో విక్రం రావు ఇంటికి వెళ్లి వారి నానమ్మ చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట స్థానిక నేతలు ఏనుగు తిరుపతి రెడ్డి, అట్టెపల్లి శ్రీనివాస్, నామసాని రాజు, భారతాని సతీష్, రవీందర్ రావు, నస్పూరి నర్సింగ్, ఆడె జంగు, ఉత్తూరి సత్తయ్య, వేణు తదితరులు ఉన్నారు



# సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్ :**

సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డి.సి.పి. ఎ.భాస్కర్‌తో కలిసి దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని, దాడులకు పాల్పడకూడదని తెలిపారు.ఈ నెల 12వ తేదీన దండేపల్లి మండలం దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాలలో జరిగిన ఘటనపై దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా



సామరస్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అటవీ ప్రాంతాలలో కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్మెంట్ క్రింద గిరిజనులు వెదురు పంట సాగుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలలోని గిరిజనులు అటవీ భూములలో వెదురు పంట సాగు చేసేందుకు గుంతలు త్రవ్వడం, మొక్కలకు నీటిని అందించడం, యూరియా ఇతర పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా వెదురు పంటను విక్రయించుకుని ఆదాయం పొందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భౌతిక దాడులకు పాల్పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గిరిజనుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సొంత నిధులచే ధన్నూర్ బ్రిడ్జికి మరమ్మత్తులు
## - సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్

**బోథ్ సెప్టెంబర్13, సూర్య మేజర్ న్యూస్:**

బోథ్ మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ తన స్వంత నిధులచే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయిన ధన్నూర్ గ్రామ బ్రిడ్జి, రోడ్డు పై ఎర్రమోరం పోసి మరమ్మత్తులు చేయించారు. భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించి కొండ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన ముళ్ళ పోదలు, చెట్లు బ్రిడ్జికి అడ్డంగా ఉండడం వల్ల చిన్నపాటి వర్షానికి బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలిగేది. ఈ విషయాన్ని తెలుసుకున్న చట్ల ఉమేష్ శనివారం బ్రిడ్జికి అడ్డంగా ఉన్న చెట్లను, గణేష్ నిమజ్జనం వల్ల ఆగిపోయిన వాటిని జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే దన్నూర్ బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, దీపావళి తర్వాత బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆశ భావంను వ్యక్తం చేశారు. బ్రిడ్జికి మరమ్మత్తులు నిర్వహించినందుకు కృతజ్ఞతగా ధన్నూర్ బి గ్రామ యువకులు చట్ల ఉమేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాళ్ళ ఇంద్రారెడ్డి, మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ గడ్డల నారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు వినయ్ రెడ్డి, అభి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు సామల సంతోష్, మాజీ సర్పంచ్ చాకలి ఆడేల్లు, రమణారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రితేష్ రెడ్డి, ఉమేష్ జాదవ్, ఎస్ కే సోయల్, స్వామి,తదితరులు పాల్గొన్నారు.



## రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి
# సందర్శించిన జిఎం

**రామకృష్ణాపూర్, సూర్య మేజర్ న్యూస్:** మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా హాస్పిటల్ ని సందర్శించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ లోని పలు వార్డులను పరిశీలించారు, రోగులతో మాట్లాడారు, ప్రతి ఒక్క ఉద్యోగికి మెరుగైన వైద్యం అందించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఏరియా హాస్పిటల్ డి.వై.సీ.ఎం.వో డాక్టర్ మధు, సివిల్ ఎస్.ఇ రాము, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏరియా హాస్పిటల్ సంక్షేమ అధికారి మదర్ సాహెబ్, హాస్పిటల్ మెట్రిన్ పుష్ప, ఉద్యోగులు పాల్గొన్నారు.



## యూరియాపై అనవసర విమర్శలు మానుకోండి
## - డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి

**ఆదిలాబాద్,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

యూరియాపై అవసర రాద్ధాంతం చేయొద్దని, రైతులు విపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందొద్దని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు.




శనివారం జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో యూరియా కొరత లేదని, విపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. యూరియా కొరత ఒక్క తెలంగాణలోనే లేదని కేంద్ర ప్రభుత్వ అసమర్ధత వల్ల దాదాపు 18 రాష్ట్రాల్లో రైతులు యూరియా కోసం కష్టాలు పడాల్సి వస్తోందని ఆయన అన్నారు. తాజాగా తెలంగాణకు 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఎనిమిది రోజుల్లో మరో 27వేల మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. దీంతో రైతులు యూరియా కోసం తిప్పలు పడే అవస్థ ఉండదన్నారు. కలెక్టరేట్ భవనం కూలిన ఘటనను బీఆర్ఎస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి అభివృద్ధిని పూర్తిగా నాశనం చేసిందే ఆ పార్టీ అన్నారు. కమీషన్ల కోసం బిల్లులు ఆపడం వల్లే నూతన కలెక్టరేట్ పూర్తి కాలేదనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గుత్తేదారుకు 12 కోట్ల బిల్లుల చెల్లింపు పూర్తయిందన్నారు. భవనం కూలిన ఘటనపై మంత్రి జూపల్లి సమీక్షలో ఆరా తీసి..నూతన భవనం గురించి వాకబు చేశారని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని హితవు పలికారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజా పాలన సాగిస్తున్న ప్రభుత్వం పై బీఆర్ ఎస్ బీజేపీ కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లను బీజేపీ తమవిగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కేవలం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పై అనవసర విమర్శలు చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ బాదం గంగన్న, మునిగెల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి,ఎండి రఫీక్, ఎమ్ ఏ షకీల్, అశోక్, రామ్ రెడ్డి, డేరా కృష్ణారెడ్డి ,దొగ్గలి రాజేశ్వర్, ఖిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా కలెక్టర్ ఆఫీస్ ప్రవేశ ద్వారం మార్పు

**ఆదిలాబాద్,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

భారీ వర్షాల కారణంగా కలెక్టర్ భవనం పాక్షికంగా కూలిపోయినందున అధికారిక కార్యాక్రమాలకు అంటే సి పి ఓ కార్యాలయం, డీసీఒ కార్యాలయం, కలెక్టర్ సమావేశ మందిరం,ఏస్‌బిఐ బ్యాంకు వైపు నుండి ట్రెజరీ కార్యాలయానికి ప్రవేశం,వెనుక వైపు నుండి అంటే ప్రక్కనే ఉన్న రాంప్ ద్వారా డీపీఆర్ఒ కార్యాలయం,ఆధార్ కేంద్రానికి ప్రవేశం మాత్రమే అనుమతించబడుతుంది.అందువల్ల, అధికారులు,ప్రజలు పోర్టికో/మెయిన్ డోర్ ద్వారా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించవద్దని అభ్యర్ధించబడింది.తాత్కాలిక ప్రాతిపదికన, కలెక్టరేట్ లోపలికి-బయటికి విభాగాలు డీపీఆర్ఒ కార్యాలయంలో పనిచేస్తాయి.ఈ విషయంలో అధికారులు,ప్రజలు సూచనలను పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరుతున్నారు

సూర్య
www.suryaa.com



## షీ టీం అదుపులో పోకిరీలు

**మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల రాముని చెరువు ఉద్యానవనం వద్ద అల్లరిచేస్తూ,ఈవ్ టీజింగ్ కి పాల్పడుతున్న పోకిరీలను అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల జిల్లా షీటీం



ఇన్చార్జి ఎస్సై ఉషారాణి తెలిపారు. కొంతకాలంగా పలువురు బాలురు ఉద్యానవనం వద్ద విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. శనివారం బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని షి టీమ్ ఆఫీసు కి తరలించారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఉపాధ్యాయుడు మురారి బాపురావు
## పరామర్శించిన-ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని లఖంపూర్ జి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మడవి బాపురావు తల్లి స్వర్గస్తులైన విషయాన్ని తేల్చుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మడావి బాపూరావు కుటుంబాన్ని పరామర్శించారు . వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బోథ్ మాజీ ఎంపీపీ తుల శీను, దేవేందర్ రెడ్డి,సురేందర్ జాదవ్, సుజిల్, ప్రతాప్ సింగ్, గ్రామ పెద్ద ఆత్రం జంగు పటేల్, మడావి దేవరావు, లింభాజీ తదితరులు ఉన్నారు.

### క్యాన్సర్ చికిత్స తో బాధపడుతున్న ఆడే అశోక్ ను
## పరామర్శించిన ఎమ్మెల్యేఅనిల్ జాదవ్

**నేరడిగొండ, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

క్యాన్సర్ పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే అశోక్



ఇటీవల క్యాన్సర్ చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆడే అశోకు ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. క్యాన్సర్ చికిత్స బాధితునికి 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆడే అశోక్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధైర్య పడద్దని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంటా మాజీ జెడ్పిటిసి పందరి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి సుజిల్, సురేందర్,ప్రతాప్ సింగ్, లింభాజీ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## చేనేత వస్త్రాలయం పునర్:ప్రారంభించాలి అని వినతి

**మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్:**

బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ మహిళలకు చేనేత చీరలు పంపిణి చేస్తున్న సీఎం రేవంతరెడ్డి కి కృతజ్ఞతలతో రేవంత్ రెడ్డి సైన్యం జాతీయ ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్ తెలియజేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ మహిళలకు బతుకమ్మ పండగ సందర్భంగా చేనేత చీరలు పంపిణి చేయడం ద్వారా దాదాపు 5000 మంది చేనేత లకు ఉపాధి దొరుకుతుంది అన్నారు.పద్మశాలి మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తించేలా ప్రభుత్వం చెర్యలు తీసుకోవాలని,బెల్లంపల్లి లో మునివేసిన చేనేత వస్త్రాలయం తిరిగి ప్రారంభించాలని, పద్మశాలి మహిళలు కృషి గుర్తించి,పద్మశాలి మహిళల పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి శ్రీధర్ బాబు కు వినతి పత్రం అందజేశారు.తెలంగాణ ఖజనా దోచిన తెరాస నాయకులపై,మాజి సీఎం కెసిఆర్ ఆస్తులు పై ఏసీబీ దాడులు చేసి,రాష్ట్రము ఖజానా కు నిధుల కొరత తిరి,రాష్ట్ర అభివృద్ధి కి ఉపయోగ పడుతుందాన్నారు.



# మహిళ రక్షణ-మా ప్రధాన లక్ష్యం

### మంచిర్యాల జోన్ పరిధిలో ఈ సంవత్సరం ఆగస్టు వరకు 81 పోకిరీలను పట్టుకున్న షీ టీమ్స్ - మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్:**

మహిళల రక్షణనే తమ ప్రధాన లక్ష్యం అని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు. శనివారం డీసీపీ కార్యాలయం లో షి టీం తో నిర్వహించిన సమీక్షా లో పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మంచిర్యాల షీ టీమ్స్ కి అందిన ఫిర్యాదులలో మొత్తం అందిన ఫిర్యాదులు -114 వాటిలో క్రిమినల్ కేసులు-18, పెట్టి కేసులు-07,89 కౌన్సెలింగ్, వార్నింగ్ ఇచ్చినట్టు తెలిపారు.బాధిత మహిళలకు పోలీస్ ఎల్లప్పుడూ మీకు అండగా అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించాలని అన్నారు. ఈవ్ టీజర్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేలా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. స్కూళ్లు, కళాశాలలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా, యువతలో ఉండే హాస్టల్స్,ఉమెన్ వర్కింగ్ హాస్టల్స్ లను సందర్శించి అక్కడ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా, సెక్యూరిటీ గార్డ్, ఒక మహిళ ఇన్చార్జి తప్పనిసరిగా ఉండేలా చూడాలి అన్నారు. హాస్టల్ లో పనిచేసే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలి అన్నారు. భరోస



కేంద్రాలలో బాధిత మహిళ లేదా బాలికకు వైద్యం, కౌన్సిలింగ్, అన్ని రకాల సేవలు అందించడంతో పాటు మీకు అండగా పోలీస్ ఉందనె మనోధైర్యాన్ని కల్పించాలి అన్నారు. భరోసా సెంటర్లో లీగల్ అడ్వైజర్, కౌన్సిలర్, మెడికల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి అన్నారు.లైంగిక వేధింపులకు గురైన మహిళలు లేదా బాలికల కు సంబందించిన కేసు పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన సమయం నుండి బాధితులకు సపోర్టుగా వారి మానసిక పరిస్థితి, విద్యా పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ వారికి భరోసా కల్పిస్తూ ఉండాలి అన్నారు.పిల్లల పోర్న్ వీడియోలు, అత్యాచారం, సామూహిక అత్యాచారం వీడియోలు అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం, డౌన్‌లోడ్ చేయకూడదు అన్నారు.దీనిని ఐటీ యాక్ట్ లోని సెక్షన్ 67బీ కింద నేరంగా పరిగణిస్తారు అని తెలిపారు. పిల్లలపై జరిగే అత్యాచారాలకు సంబంధించి వీడియోలు ప్రదర్శించడం లేదా సర్క్యులేట్ చేయడం నేరమని ఈ సెక్షన్ చెబుతోంది అన్నారు.పోక్సో చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం పిల్లలకు సంబంధించి అశ్లీల వీడియోలను స్టోర్ చేయడం లేదా కలిగి ఉండటం నేరం అని తెలిపారు.ఈ చట్టాల ప్రకారం నేరం రుజువైతే జైలు శిక్ష లేదా జరిమానా, లేదా జైలు శిక్ష, జరిమానా కలిపి విధించే అవకాశం ఉంది అన్నారు. చిన్నారులకు సంబంధించి పోర్న్,రేప్, సామూహిక అత్యాచారాల వీడియోలు ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, డౌన్‌లోడ్ చేయడం, గూగుల్ డ్రైవ్‌లో స్టోర్ చేస్తే,వెంటనే మెయిల్ ఐడీ, ఐపీ అడ్రస్ గుర్తించేలా నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్ ప్లాయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీమెక్) వద్ద వ్యవస్థ ఉంది అన్నారు. ఇది డార్క్,డీప్ వెబ్ తోపాటు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌పై సైబర్ పెట్రోలింగ్ చేస్తుంటుంది అన్నారు. మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువ వేధింపులకు గురవుతున్నారని అన్నారు. అలాంటప్పుడు జాగ్రత్త పడాలి తప్ప, అధైర్య పడవద్దు అని అన్నారు. వేధింపులకు పాల్పడిన వారి వివరాలతో షీ టీం ని సంప్రదించి ఫిర్యాదు చేస్తే అట్టి వారి ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఫిర్యాది వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. మహిళలు వేదింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్ ని, రామగుండం షి టీం వాట్సాప్ నెంబర్ 6303923700 ద్వారా లేదా, మంచిర్యాల షి టీం 8712659385 నెంబర్ లేదా, 100 నెంబర్ కు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, మంచిర్యాల జోన్ షీ టీం ఇన్చార్జి మహిళా ఎస్సై ఉషారాణి, హైమ, భరోసా సెంటర్ సిబ్బంది,షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 17 నుండి భాజపా
## ఆధ్వర్యంలో సేవపక్ష కార్యక్రమం

**సారంగాపూర్, సెప్టెంబర్ 14, సూర్య మేజర్ న్యూస్**

సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు సేవ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ తెలిపారు.నరేంద్ర మోది, జన్మదినం నుండి మహాత్మా గాంధీ జయంతి వరకు



సేవాపక్షంలో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలను చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 17వ తేదీన మండల కేంద్రంలో రక్తదాన శిబిరం, 18వ తేదీన ఆత్మనిర్భార్ భారత్, వికసిత్ భారత్ అంశాలపై, చిత్రలేఖనం, తదితర కార్యక్రమాలను నిర్వహించనునట్లు ఆయన తెలిపారు.ఆయా కార్యక్రమాల నిర్వాహన కొరకై కార్యకర్తలతో సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ను సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపల్

**కాగజ్నగర్, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా గ్రూపులలో మిగిలిన సీట్లకు ఈ నెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. కావున ఇప్పటివరకు డిగ్రీ లో చేరని విద్యార్థులు ఈ చివరి అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఆయా విభాగాలలో మిగిలిన సీట్లను నిబంధనల మేరకు రిజర్వేషన్, కం . మెరిట్ ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు.స్పాట్ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఎలాంటి ఉపకార వేతనాలకు అర్హులు కారని,వీరికి ఫీ రిఎంబర్స్ మెంట్ వర్తించదని తెలిపారు.ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. విద్యార్థులు పదవ తరగతి మెమో,ఇంటర్ మెమో,టి.సి,స్టడీ సర్టిఫికేట్,కుల,ఆదాయ, రెసిడెన్షియల్ సర్టిఫికేట్లతో పాటు ఒకేషనల్ విద్యార్థులు బ్రిడ్జ్ కోర్సు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిమిత్తం సమర్పించాలని సూచించారు.

### రైల్వే ప్రయాణీకుల బాధలు తీర్చండని జిఎం కు
## వినతి పత్రం ఇచ్చిన సిరిపూర్ ఎమ్మెల్యే

**కాగజ్నగర్, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో శనివారం రోజు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఎస్. కే. శ్రీవాత్సవ సిర్పూర్ కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను



మర్యాదపూర్వకంగా కలిసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ కు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఫ్లాట్ ఫామ్ నెం.3ను అభివృద్ధి చేయాలని, టికెట్ కౌంటర్ పెట్టాలని మరియు టాయిలెట్లు నిర్మించాలని కోరడం జరిగింది. కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించి 3 ఫ్లాట్ ఫామ్లకు 3 లిఫ్ట్ లు ఏర్పాటు చేయాలని కోరారు. కేరళ ఎక్స్ప్రెస్ కు కాగజ్ నగర్ లో హాల్టింగ్ ఇవ్వాలని, అలాగే చర్లపల్లి నుండి హౌరా వరకు సిర్పూర్ కాగజ్నగర్ మీదుగా కొత్త రైలు నడపాలని, తద్వారా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న బెంగాలీ సోదర, సోదరీమణులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ ఎస్.కె శ్రీవాత్సవ కాగజ్నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ .20 కోట్లు కేటాయిస్తున్నామని, రైల్వే స్టేషన్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా కొమరం భీం జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, రైల్ సేవా సమితి అధ్యక్షులు ప్రయాగ్ తివారి, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ కౌన్సిలర్లు దెబ్బటి శ్రీనివాస్, అరుణ్ లోయ, పవన్ బల్దేవ, సంతోష్, అనిల్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

## - పర్యవేక్షించిన ఎమ్మెల్యే

**కాగజ్నగర్, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్ నగర్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ కార్యాలయం ఆవరణలో శనివారం ఎరువుల పంపిణీ ప్రారంభమైంది. సిర్పూర్



నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఇక్కడికి వచ్చి ప్రతి రైతుకి యూరియా బస్తాలు పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని ఇక్కడ అధికారులను ఆదేశించారు. మొత్తం రెండు లారీల్లో 888 యూరియా బ్యాగులు ఇక్కడికి చేరుకున్నాయి. ఎలాంటి గొడవలు జరగకుండా కాగజ్‌నగర్ టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై యాదగిరి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## ఏ ఆర్ కె హాస్పిటల్ ప్రారంభోత్సవంలో

# పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీ

**నేరడిగొండ సెప్టెంబర్ 13 సూర్యా మేజర్ న్యూస్**

బోథ్ మండలంలోని కంటేగావ్ గ్రామానికి చెందిన డాక్టర్.రంజిత్ జాదవ్ అదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో నూతనంగా ఏ ఆర్ కే హాస్పిటల్



ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ముఖ్య అతిథులుగా హాజరై నూతన ఆసుపత్రిని ప్రారంభించారు. డాక్టర్ రంజిత్ జాదవ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ లను ఘనంగా సన్మానించారు. వీరి వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, రూప్ చంద్, శ్రీధర్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి, అభిరామ్ రెడ్డి, ప్రీతం రెడ్డి, దేవేందర్ రెడ్డి, పలువురు నాయకులు తదితరు ఉన్నారు.

## వరిలో నానో యూరియా వాడకం వల్ల

# అధిక దిగుబడులు పొందవచ్చు

**సోన్, సెప్టెంబర్ 13 సూర్య మేజర్ న్యూస్:**

వరిలో నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని గంజాల్ గ్రామంలో శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా నానో యూరియా పిచికారి చేసిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మొదటి దఫా గ్రాన్యూల్ యూరియా వాడిన తరువాత రెండవ దఫాలో నానో యూరియా పిచికారీ చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. వరి పంటలో అక్కడక్కడా బాక్టీరియా ఎండాకు తెగులు వస్తుందని తెలిపారు. దాని నివారణకు నత్రజని వాడటం తాత్కాలికంగా నిలిపివేసి పోటాష్ వాడాలని సూచించారు. దాని ప్రభావన్ని తగ్గించటానికి ప్లాంతో మైసిన్, కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పోశెట్టి, ముత్యం తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ప్రకాష్ పటేల్


**భైంసా టౌన్,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్:** భైంసా పట్టణంలోని సంస్కార్ పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్ పటేల్ ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు-2025వ సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందడం జరిగింది.ఈ సందర్భంగా ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకార్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రకాష్ పటేల్ తన



బోధన పటిమతో విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడమే కాకుండా పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంచే విధంగా కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుభాష్,భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్ రావు పటేల్,పిఆర్టియు నాయకులు రమణారావు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాచేవాడ్ గంగా ప్రసాద్,లయన్స్ క్లబ్ సభ్యులు మోహన్ రావు,తదితరులు ఉన్నారు.

## డాక్టర్ సాప పండరికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందించిన ఆనందిత ఫౌండేషన్

**భైంసా టౌన్,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భైంసాలోని శ్రీ ఫంక్షన్ హాల్ నందు"ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యందు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి, విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలు, విద్యార్థులలో నైపుణ్యాలు




పెంపొందించడంలో, సమాజ అభివృద్ధిలో చూపిన అంకితభావం, కృషి, నిబద్ధతకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ మాట్లాడుతూ, అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, అజ్ఞానమనే చీకటిని తొలగించి, విజ్ఞానమని వెలుగును పంచే ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత 20 సంవత్సరాలుగా పలు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో, కళాశాలలో తెలుగు బోధిస్తున్న డాక్టర్ సాప పండరిని శాలువాతో సన్మానించి మేమంటో అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆనందిత ఫౌండేషన్ నిర్మల్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్, భైంసా మండల విద్యాధికారి సుభాష్, పి ఆర్ టి యు జిల్లా సెక్రటరీ రమణ రావు, ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముస్తక్ టీచర్, లయన్స్ క్లబ్ భైంసా ప్రెసిడెంట్ కదం మోహన్ పటేల్, సీనియర్ తెలుగు పండితులు పుండలిక్, వికాస్ స్కూల్ కరస్పాండెంట్ రవీనా మేడం, సంస్కార్ స్కూల్ కరస్పాండెంట్ ప్రకాష్ పటేల్, ప్రభుత్వ ఉపాధ్యాయులు సిలార్ గంగాధర్, గంధం సాయినాథ్, పుండలిక్, విశ్రాంత ఉపాధ్యాయులు రాచేవాడ్ గంగ ప్రసాద్ పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి విశిష్టమైన పాలజ్ కర్ర వినాయకుని లడ్డు ప్రసాదాన్ని డాక్టర్ సాప పండరి అందరికీ పంపిణీ చేశారు.

## ఎమ్మెల్సీ అధర్వంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:** సిర్పూర్(టి) మండలంలో పాతట్లగూడ గ్రామానికి చెందిన పలువురు నాయకులు మరియు యువకులు ఎమ్మెల్సీ నివాసంలో హస్తం గూటికి చేరారు.సిర్పూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ నాయకత్వాన్ని బలపరుస్తూ సిర్పూర్ గ్రామ పంచాయతీ,హనుమాన్ నగర్ (షైక్ అహ్మద్ గూడా)కి చెందిన దేవాజీ బొట్టుపల్లి, రాజేందర్, పాండు,కాపీడే రాజు, చౌదరి శ్యామ్ రావు మరియు 40 మంది యువకులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరికయ్యారు.ఈ సందర్భంగా వారినీ ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భానుసారంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐతమత్యంగా పనిచేస్తేనే పార్టీ మరియు గ్రామాల అభివృద్ధి సాధ్యం అని రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చెయ్యాలని సూచించారు.

## యూరియా కోసం వచ్చిన రైతులకు కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అన్నదానం

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:** సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం శనివారం నిర్వహించారు.వారు మాట్లాడుతూ రైతులు గ్రామాల నుండి ఉదయాన్నే వచ్చి పడిగాపులు కాస్తున్నారని వారు ఆకలితో అలమటించ కూడదనే ఉద్దేశ్యంతో అన్న దాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు కోనేరు ఫణి,సిర్పూర్ మాజీ సర్పంచ్ సయ్యద్ కీజర్ హుస్సేన్ , మాజీ ఉప సర్పంచ్ తోట మహేష్, తంగడపల్లి సంతోష్, మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రం, మాజీ వార్డు సభ్యులు షిండే లాలాజీ, ఇఫ్ఫాత్ హుస్సేన్, షేక్ వసీం, నాయకులు బోర్కుట్ మోహన్,తిరుపతి, శ్రీను, అహ్మద్ హుస్సేన్, శ్రీనివాస్, గడ్డి రవి పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ యూనియన్ ఇచ్చే ఏ పిలుపుకైనా

# కార్మికుల సిద్ధంగా ఉండాలి

## ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండి అక్బర్ ఆలీ

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సి హెచ్ పి లో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండి అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ గురించి కార్మికులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంగా రెండుసార్లు డైరెక్టర్ (పా )తో ఒకసారి సీ & ఎండి తో సమావేశం జరిగిన ఒప్పుకున్న అంశాలను కూడా సర్కులర్ ఇవ్వకుండా యాజమాన్యం కాలయాపన చేస్తున్నది అని అన్నారు, సొంతింటి పథకం కమిటీ వేసిన ఇప్పటివరకు ఒక్క సమావేశం కూడా జరగలేదు దీనిపై 2009వ సంవత్సరంలో సొంతింటి పథకం సర్కులర్ ఇచ్చిన ఆనాడు కార్మికులు ఇష్టపడలేదు ఈనాడు దాన్నే అమలు చేయండి అంతే కాలయాపన చేయడం వలన కార్మిక వర్గం నష్టపోతోంది మెడికల్ బోర్డు 10 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న ఆనాడు



అడ్డం రాని ఏసీబీ బూచిని ఈరోజు చూపుతో మెడికల్ బోర్డు ఆపి కార్మిక కుటుంబాలను హింసించడం యాజమాన్యం చేసిన తప్పు గతంలో మెడికల్ బోర్డు పెట్టి గతంలో లానే అమలు చేయాలి 2024 25 సంవత్సరం వాస్తవ లాభాలు ప్రకటించి అందులో 35 శాతం వాటా ప్రకటించాలి ఇన్కమ్ టాక్స్ విషయంలో కోల్ ఇండియా మాదిరిగా పెరక్స్ మీద టాక్ రికవరీ చేసిన మొత్తాన్ని కార్మికులకు రిఫండ్ చేయాలి నూరేళ్ల సింగరేణిలో ఎన్నడూ లేని ట్రాన్స్ఫర్ పాలసీ తెచ్చి కార్మికులను ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టారు దీన్ని తొలగించాలంటే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు ఈపీఆపరేటర్ల విషయంలో డి టు సి, సి టు బి గ్రేడ్స్ ఆపరేటర్లకు ఇస్తామని ఒప్పుకున్నా ఇంతవరకు సర్కులర్ ఇవ్వలేదు మాయమాటలతో కాలయాపన చేస్తున్నారు డిస్మిస్ కార్మికులకు ఒకసారి తిరిగి కొనసాగే అవకాశం ఇవ్వాలని కోరగా నాంచి వేసే దూరం చేస్తున్నారు అన్ని క్యాడర్ స్కీములను పరిష్కరించాలని డిమాండ్ చేయగా దానిపై కూడా నాన్చివేత ధోరణి మారుపేరుల విషయమే యాజమాన్యం స్వచ్ఛ సమావేశంలో అంగీకరించిన అడ్వకేట్ జనరల్ అభిప్రాయం రావాలని కాలయాపన చేస్తున్నారు 2018లో పెండింగ్లో ఉన్న తిరస్కరించిన డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ 2020 ప్రకారం కుల పరిశీలించి అందరికీ అవకాశం ఇవ్వాలి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కోరగా నాంచి వేసే ధోరణి చేస్తున్నారు మైనింగ్ ట్రేడ్మెట్లకు సూటబుల్ జాబ్ విషయంలో యాజమాన్యం ఒప్పుకొని చాలాకాలం అయింది దాని అమలుకు నోచుకోలేదు ఎన్ మైనస్ వన్ విషయంలో యాజమాన్యానికి నయా పైసా నష్టం లేకున్నా దానిపై నిర్ణయం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తుంది పై సమస్యలపై దృష్టిలో పెట్టుకొని జరగాల్సిన స్ట్రక్చర్ మీటింగ్ బహిష్కరించడం జరిగింది కానీ యూనియన్ ఇచ్చే ఏ పిలుపుకైన సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ యొక్క సమావేశంలో రామకృష్ణపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఇప్ప కాయల లింగయ్య, ఆర్కే పి సి హెచ్ పి ఫిట్ కార్యదర్శి, హరి రామకృష్ణ, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మాదాసి వేణుగోపాల్, కమిటీ సభ్యులు వర్క్మెన్ ఇన్స్పెక్టర్ అబ్బాస్ శ్రీధర్ రావు దూత భాస్కర్ శ్రీనివాస్ డొక్కు శ్రీనివాస్ మండల శ్రీనివాస్ గోవర్ధన్ రెడ్డి ఆవుల మల్లమ్మ మొదలగువారు పాల్గొన్నారు.

## చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం

**భైంసా టౌన్,సెప్టెంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మరియు అధ్యాపక బృందానికి చేయూత ఫౌండేషన్ వారి 108 మెడికల్ టెక్నిషియన్ పూజారి లక్ష్మణ్ సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఎందుకని అంటే నేటి ఆహారపు అలవాట్ల వల్ల ఎన్నో వ్యాదులకు గురి అవ్వడం జరుగుతుంది. ఇందులో ముఖ్యంగా గుండెపోటు సంభవించేటువంటి పరిస్థితులు చాల ఉన్నాయి. కావున మనిషికి గుండె పోటు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్ళినప్పుడు గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది. ఈ సందర్భంలో మనం సిపిఆర్ చేయడం ద్వారా గుండే మల్లి కొట్టుకోవడం జరిగి మనిషి కోలుకునే అవకాశం ఉంటుంది. కావున సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన గలిగి ఉండాలని తెలియజేశారు.చేయూత ఫౌండేషన్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు కొత్తుర్ శంకర్ మరియు పూజారి లక్ష్మణ్ , సత్యనారాయణ గురుకర్ అనిల్ మరియు కలశాల యాజమాన్యం పాల్గొన్నారు. విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన కల్పించినందుకు కలశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.